క్లుప్తంగా

పాతపేటలో వైద్య శిబిరం

పలమనేరు: స్థానిక పాతపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం స్వస్థ్ నారీ పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు డాక్టర్లు వైద్య పరీక్షలు అవసరమైన మందులు ఇచ్చారు. మెడికలాఫీసర్ డాక్టర్ సురేఖ మాట్లాడుతూ, వయసు మీరే కొద్దీ మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, ఉదయం తప్పనిసరిగా వాకింగ్ చేయాలని సూచించారు. ఆరోగ్యమే అన్నింటికన్నా ముఖ్యమనేది గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు యుగంధర్, ప్రవీణ్ మీనా, కమిషనర్ రమణారెడ్డి, సీడీపీఓ ఉమారాణి, ఆస్పత్రి సలహా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

13 గంటల పని విధానంపై నిరసన



పలమనేరులో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

పలమనేరు: ఇకపై కార్మికులు రోజూ 13 గంటలు పనిచేయాలని రాష్ట్ర అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం పాస్ చేసిన బిల్లు అన్యాయమంటూ స్థానిక సీఐటీయూ నాయకులు గిరిధర్ గుప్తా ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానికంగా ఆపార్టీ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని కూలీలు, కార్మికులు కూటమి మాయమాటలు నమ్మి అధికారాన్ని కట్టబెడితే కూటమి పాలకులు కార్పొరేట్ శక్తులకు అండగా ఉంటూ కార్మికుల కడుపు కొడుతున్నారని విమర్శించారు. ఇప్పటికే కూటమి పాలనపై తీవ్రంగా ప్రజా వ్యతిరేకత వస్తోందని, ఈ తరుణంలో ఇలాంటి దారుణమైన జీవోలతో కూటమి పతనం కావడం తథ్యమన్నారు. నిరసనలో పలువురు సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



కరాటేలో ప్రతిభ చాటిన పలమనేరు విద్యార్థులు

పలమనేరు: హైదరాబాద్‌లో జరిగిన సౌత్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్‌లో పట్టణానికి చెందిన లావణ్య, వర్షితకృష్ణ, సేవాహర్ష, హేమంత్, ముర్తుజా, మతీన్‌బేగ్, హైదర్ ప్రతిభ చాటి బహుమతులు సాధించారని కరాటేమాస్టర్ వంశీ మంగళవారం తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన సినీనటులు సుమన్ చేతుల మీదుగా వీరు బహుమతులను అందుకున్నట్టు పేర్కొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

పలమనేరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం మంగళవారం కళాశాల ప్రాంగణంలో పిచ్చిమొక్కలను తొలగించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కన్నయ్య, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ తులసీరామ్, అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

పెద్దపంజాణి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతదారులందరూ ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని ఎంపీడీఓ బాలాజి కోరారు. మంగళవారం మండలంలోని శివాడి, నిడిగుంట, పెద్దవెలగటూరు పంచాయతీలలో ఈకేవైసీ నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి వేతనదారులతో మాట్లాడారు. ఈకేవైసీ ద్వారా ఆధార్ నంబరును ఉపాధి హామీ జాబ్ కార్డుతో అనుసంధానం చేసి ఇకపై పనులకు హాజరయ్యే వేతనదారులకు ముఖ ఆధారిత హాజరు నమోదు చేస్తారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ శారదాదేవి, పీఎస్‌లు రామాంజులు, పద్మనాభరెడ్డి పాల్గొన్నారు.

లోక్ కళ్యాణ్‌మేళాకు స్పందన

పలమనేరు: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన లోక్ కళ్యాణ్ మేళాకు స్పందన లభించింది.. పట్టణంలోని వీధి విక్రయదారులకు బ్యాంకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు దరఖాస్తులను స్వీకరించారు. వీరికి తొలుత రూ.10వేలు ఆపై 15వేలు, రూ.25వేలు, రూ.50 వేల వరకూ రుణాలు ఇవ్వనున్నట్టు మెప్మా పీడీ రవీంద్ర తెలిపారు. అలాగే వీధివిక్రయదారులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ రమణారెడ్డి, శ్రీరాములు, హరీష్, మెప్మా బాబా, బ్యాంకర్లు పాల్గొన్నారు.

మోటార్ సైక్లిస్టులకు గాయాలు

పుంగనూరు: ద్విచక్రవాహనం అదుపు తప్పడంలో ఇద్దరు మోటార్ సైక్లిస్టులు గాయపడిన సంఘటన మంగళవారం మండలంలోని గూడూరుపల్లె వద్ద చోటుచేసుకుంది. వివరాలు..మంగళం గ్రామానికి చెందిన రైతులు శంకరప్ప(35), కేశవ(25) తమ పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో బట్టందొడ్డికి బయలుదేరారు. మార్గమధ్యంలో గూడూరుపల్లె వద్ద బైక్ అదుపు తప్పడంలో కింద పడి గాయపడ్డారు. స్థానికులు గమనించి వారిని 108లో ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కౌండిన్య బ్యాక్‌వాటర్‌తో మునిగిన పంటలు



నీట మునిగిన వరిపంటను చూపుతున్న రైతు



వరి.. వర్రీ..!

నీటమునిగిన వరిపంటకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని మండలంలోని కాలువపల్లె రైతులు కోరుతున్నారు. ఇక్కడి కౌండిన్య జలాశయానికి వరదనీరు చేరి రిజర్వాయర్ నిండుకుండను తలపిస్తోంది. దీంతో బ్యాక్ వాటర్ ఇక్కడి పలువురి రైతుల పంట పొలాల్లోకి చేరింది. ఫలితంగా ఇక్కడ సాగుచేసిన వరి తదితర పంటలు నీట మునిగాయి.

- కౌండిన్యజలాశయం బ్యాక్‌వాటర్‌లో మునిగిన పంటలు
- పంటలు నీటిపాలయ్యాయని రైతన్నల ఆవేదన
- అధికారులకు ముందుచూపు లేదా?

పలమనేరు: కౌండిన్యప్రాజెక్టు కోసం రైతుల నుంచి భూములు సేకరించినప్పుడు కొందరికి నష్టపరిహారం ఇచ్చారు. అయితే బ్యాక్‌వాటర్ మూలాన పంటలు నీట మునిగే రైతులను అస్సలు పట్టించుకోలేదు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యాక తొలిసారి ప్రాజెక్టు నిండినప్పుడు పొలాల్లోకి నీరుచేరడంతో అప్పటినుంచి బాధిత రైతులు పంటలు నష్టపోతూనే ఉన్నారు. సమస్యను అధికారులకు దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం, వారి గోడు ఆలకించకపోవడం శాపంగా మారింది.

మట్టి తోలి చేల ఎత్తు పెంచుకోవడమే మార్గం

ప్రభుత్వం తమకు నష్టపరిహారం ఇవ్వడం లేదా తమ భూములు ఎత్తు పెంచుకునేందుకు మట్టిని నింపడం లాంటి ప్రత్యామ్నాయ చర్యలైనా తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. లేనిపక్షంలో ఏటా నది ప్రవహించి ప్రాజెక్టు నీరు వచ్చినప్పుడల్లా ఈ సమస్యతో పంట నష్టం వాటిల్లుతూనే ఉంటుందని గగ్గోలు పెడుతున్నారు.

పలువురు రైతులకు తప్పని కష్టం

ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ కారణంగా కాలువపల్లెకు చెందిన పలువురు రైతులకు కష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం ఇక్కడ 70 ఎకరాల దాకా వరి పొట్టదశలో ఉంది. ఇదంతా నీటి మునగడంతో పంట పాచిపోవడం గ్యారెంటీ. ఎకరా వరిమడి నాటేందుకు రూ. 30వేల వరకూ ఖర్చు చేశామని, ఇప్పుడిదంతా నీటిపాలై, జీవనాధారం కోల్పోయామని రైతన్నలు కన్నీటి పర్యంతమవుతున్నారు. తమకు ప్రభుత్వం పంటనష్ట పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి



రెండెకరాల వరిమడి నీటమునిగిపోయింది. పంట ఎలాగూ చేతికిరాదు. ఈ సమస్యపై మేము గతంలోనుంచే అధికారులకు అర్జీలిచ్చినా ఏమీ పట్టించుకోలేదు. కనీసం అధికారులు ఇక్కడి పరిస్థితులను చూడటం కూడా లేదు. ఇకనైనా అధికారులు మాకు న్యాయం చేయాలి.

–లోకనాథం, రైతు, కాలువపల్లె

మేమెట్టా బతికేది?



ప్రాజెక్టు నిండి మా కయ్యల్లోకంతా నీరు వచ్చేసినాది. ఇంకో నెలలో చేతికొచ్చేపంట నీటిపాలైనాది. మేం ఎట్టా బతికేది? అప్పోసప్పో చేసి వరిపంట సాగుచేసినాం. ఇప్పుడు అప్పుల పాలు కావాల్సిందేనా? దీనిపై ప్రభుత్వం న్యాయం చేయాల. మా పొలాల్లోకి నీరు చేరకుండా ఏదోఒకటి చేస్తే కదా! లేకుంటే మేమెట్టా బతికేది? –జయరామయ్య, రైతు, కాలువపల్లె

నోటీస్ బోర్డు

- సచివాలయ సిబ్బందికి శిక్షణ

వి.కోట: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు పీ4 మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వరావ్ సోమవారం తెలిపారు. మండలంలోని అన్ని సచివాలయ సిబ్బంది హాజరు కావాలని కోరారు.

శ్మశానవాటిక ఆక్రమణ.. దళితుల నిరసన



శ్మశానవాటిక స్థలం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళితులు

పుంగనూరు: పట్టణంలోని తోపుమఠం వద్ద తమ శ్మశానవాటికను ఆ ప్రాంత వాసులు ఆక్రమించారని మంగళవారం సాయంత్రం దళితులు నిరసన వ్యక్తం చేశారు. ఇది తెలుసుకున్న తహసీల్దార్ రాము ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. సర్వే చేసి శ్మశానవాటిక కబ్జా కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దళిత నాయకులు రాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

డీపీఓ సమీక్ష

పుంగనూరు: మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు వివిధ కార్యక్రమాలపై సమీక్షించారు. ఎంపీడీఓ, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాతా.. నమోస్తుతే..



వి.కోట: ప్రత్యేక అలంకారంలో దుర్గామాత



పెద్దపంజాణి: గాయత్రి దేవి అలంకారంలో కాళికాదేవి



కల్లూరులో...



కుప్పం : పట్టణంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ ప్రతిమ

వి.కోట: స్థానిక దుర్గానగర్‌లోని శ్రీ దుర్గా మాత, వాసవీ మాత ఆలయాల్లో దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి అర్చకులు ఉదయం అభిషేకాలు నిర్వహించారు. వాసవిమాతను అర్థపూర్ణాదేవిగా, దుర్గామాతను గాయత్రి దేవి (కామాక్షి దేవి)గా అలంకరించి అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం ఉయ్యాలసేవ నిర్వహించి భక్తులతో సహస్ర నామార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

గాయత్రి దేవిగా కాళికాదేవి

పెద్దపంజాణి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు మంగళవారం శివాడిలోని కాళికా దేవి శ్రీ గాయత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం శివాడి ఆర్యవైశ్య సంఘానికి చెందిన అర్చన, సురేష్, అన్నపూర్ణ, ఆనందాచారి తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ధనంజయ రెడ్డి, వేణురెడ్డి, మల్లిరెడ్డి తదితరులు ఉభయదారులుగా వ్యవహరించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి అన్నదానం చేశారు.

బాల త్రిపుర సుందరిగా వాసవీ కన్యకాపరమేశ్వరి

పులిచెర్ల(కల్లూరు): దేవీ శరన్నవరాత్రు ఉత్సవాల్లో భాగంగా కల్లూరులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని బాల త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు .ఆర్.ఎస్‌రాజన్ కుటుంబీకులు అమ్మవారిని ప్రత్యేక అలంకరణతో పూజలు చేశారు.

పుంగనూరులో..

పుంగనూరు: నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు మంగళవారం స్థానిక శ్రీవాసవి కన్యకా పరమేశ్వరిదేవి వజ్ర కవచ అలంకారంలో, శ్రీ భోగనంజుండేశ్వరస్వామి ఆలయంలో పార్వతిదేవి గాయత్రిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి గాజుల అలంకరణ, శ్రీ సల్లాపురెమ్మ ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో, శ్రీబాటగంగమ్మ ఆలయంలో అమ్మవారు బాల త్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తీర్థం శ్రీ రాఘవేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

కుప్పం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణంలో దుర్గామాత ప్రతిమలను ప్రతిష్ఠించి ఘనంగా పూజలు చేశారు. ప్రసన్న తిరుపతి గంగమ్మ దేవాలయం, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి, పెద్దపుల్లి గంగమ్మ దేవాలయం, ముత్తమారెమ్మ దేవాలయం, శ్రీ రామలింగేశ్వర దేవాలయంలో నవరాత్రుల పూజలు చేశారు. ఆయా ఆలయాలు భక్తుల సందడితో కనిపించాయి.



పుంగనూరు: భోగనంజుండేశ్వరస్వామి ఆలయంలో..



బైరెడ్డిపల్లె: శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



బైరెడ్డిపల్లె: శ్రీ బాటగంగమ్మ ఆలయంలో..



వి.కోట: అన్నపూర్ణాదేవి అలంకరణలో వాసవీమాత

భక్తిప్రపత్తులతో విగ్రహ ప్రతిష్ఠ



సీతారాముల విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని రేణుమాకులపల్లె పంచాయతీ బి.వడ్డిపల్లెలో మంగళవారం సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన భక్తిప్రపత్తులతో నిర్వహించారు. దీనికి హాజరైన మాజీమంత్రి, పుంగనూరు శాసన సభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి గ్రామ ప్రజలు ఘనస్వాగతం పలికారు కార్యక్రమంలో ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ముర్వత్‌బాషా, రెడ్డీశ్వరరెడ్డి, హేమసుందరరెడ్డి, విజయభాస్కరరెడ్డి, రాఘవరెడ్డి, రాజేష్, నిరంజన్‌రెడ్డి, సుబ్బరాజ, మధు తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో వైద్య శిబిరాలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి మురళి

పెద్దపంజాణి: మహిళలు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని పెద్దపంజాణి, రాయలపేట ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు మురళి, మాధవి తెలిపారు. స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని అప్పినపల్లె, తుర్లపల్లెలో మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. పరిసర ప్రాంత మహిళలకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పోషకాహారం తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. సీజనల్ వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్య,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బేటయారస్వామి ఉత్సవాలు జయప్రదం చేయండి

కడా పీడీ వికాస్ మర్మత్



ఉత్సవాల కరపత్రాలను విడుదల చేస్తున్న కడా పీడీ, అధికారులు

కుప్పం: మండలంలోని బేటరాయస్వామి దేవాలయంలో పెరటాసి ఉత్సవాలను జయప్రదం చేయాలని కడా పీడి వికాస్ మర్మత్ ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో ఆయన ఉత్సవాల నిర్వహణపై సమీక్షించారు. పెరటాసి నెల మూడవ శనివారం, అక్టోబర్ 4వ తేది శ్రీనివాస కళ్యాణం, అన్నదానం కార్యక్రమాలపై అధికారులతో చర్చించారు. కుప్పం చుట్టు పక్కల ప్రాంతాల నుంచే కాకుండా సరిహద్దులోని తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల పెద్ద సంఖ్యలో రానున్న దృష్ట్యా ఏర్పాట్లు ముమ్మరంగా చేయాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. ఆలయానికి భక్తులందరికీ అన్న ప్రసాదం, తాగునీటి కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అనంతరం పెరటాసి మూడవ శనివారం ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ పార్థసారథి, ఆర్డీఓ శ్రీనివాసులు, రెస్కో చైర్మన్ ప్రతాప్, తహసీల్దార్ చిట్టిబాబు. అటవీ శాఖ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తం



గంగినాయనపల్లెలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది



కుప్పం రూరల్: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుభాష్ రాజ్

బైరెడ్డిపల్లె: వ్యాధుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి పద్మావతి అన్నారు. మండలంలోని గంగినాయనపల్లెలో మంగళవారం స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పోస్టర్లు ఆవిష్కరించి ఆమె మాట్లాడారు. ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ, ఎమ్‌ఎల్‌హెచ్‌పీ సాయిదివ్య, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపల్లెలో...

కుప్పం రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న స్వస్థ్ నారీ అభియాన్ కార్యక్రమాన్ని గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్.కొత్తపల్లె వైద్యాధికారి డాక్టర్ సుభాష్‌రాజ్ కోరారు. మంగళవారం ఎస్.కొత్తపల్లె పీహెచ్‌సీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, స్త్రీలకు క్యాన్సర్ పరీక్షలు, రక్తపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో వైద్య నిపుణులు డాక్టర్ బాలాజి, ఉదయలక్ష్మి, సుప్రీత్, జ్యోషిత వైద్యసేవలు అందించారు.

ఆగని ఏనుగుల దాడులు



ఏనుగులు ధ్వంసం చేసిన అరటితోట

పులిచెర్ల(కల్లూరు): మండలంలో పంటలపై ఏనుగుల దాడులు రోజు రోజుకూ తీవ్రమవుతున్నాయి. తాజాగా మంగళవారం తెల్లవారుజామున పాతపేట పంచాయతీలో పలువురు రైతుల పంటలకు ఏనుగులు నష్టం కలిగించాయి. ఆవుల పెద్దిరెడ్డిగారిపల్లె, కురవపల్లెలో వీటి దెబ్బకు పంట నష్టం వాటిల్లింది. పూరేడువారిపల్లెలో కల్లూరుకు చెందిన రాజేంద్రకు మామిడితోటకు ఉన్న ముళ్ల కూసాలను విరిచేసాయి. అలాగే వెంకటేశ్‌కు చెందిన అరటి చెట్లను, మరికొందరి రైతుల మామిడి కొమ్మలు విరిచేశాయి. వేరుశనగ పంటలను నాశనం చేసాయి.

నేటి నుంచి మలాలమ్మ నవరాత్రి ఉత్సవాలు

గంగవరం: మండలంలో బుధవారం నుంచి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. మేలుమాయి క్రాస్ వద్ద ఉన్న శ్రీమలాలమ్మ(చాముండేశ్వరీ) దేవి ఆలయంలో అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ధర్మకర్త చంద్రప్ప మంగళవారం తెలిపారు. తొలి రోజు బుధవారం అమ్మవారు శ్రీబాలత్రిపుర సుందరి అవతారం, గురువారం గాయత్రీదేవిగా, శుక్రవారం శ్రీమహాలక్ష్మిదేవి, శనివారం శ్రీఅన్నపూర్ణాదేవి దర్శనమిస్తారు. రోజూ భక్తులకు అన్నదానం, చివరి రోజు పుష్పపల్లకి సేవ ఉంటుందని చెప్పారు.

బోయకొండలో ప్రారంభమైన దసరా ఉత్సవాలు

- బాలా త్రిపుర సుందరీదేవి అలంకారంలో అమ్మవారు
- భక్తిశ్రద్ధలతో హోమ పూజలు
- తరలివచ్చిన భక్తజనం

చౌడేపల్లె: కోరిన కోర్కెలు తీర్చే ఆరాధ్య దైవంగా పేరొందిన బోయకొండ గంగమ్మ ఆలయంలో మంగళవారం దసరా శరన్నవ రాత్రులు వేడుకగా ప్రారంభమయ్యాయి. అర్చకులు, వేద పండితులు అమ్మవారిని పరిమళ భరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో కొలువుదీర్చారు. ఆలయం ముఖద్వారంతోపాటు గర్భాలయం, ప్రధాన ఆలయంలో రంగు రంగుల పూలు, విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి ఆవరణలో అమ్మవారి ఉత్సవమూర్తిని నెలకొల్పి వేదపండితులు గోవర్ధనశర్మ గణపతి పూజ, స్వస్తివాచనం అభిషేకాలు, అర్చనలు, గణపతి హోమం, చండీహోమం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేశారు. వీటికి వేణుగోపాల్‌రెడ్డి, సుగుణ (తిరుపతి) జీవన్ ప్రకాష్, ఫిల్లారి ఏజెన్సీస్ (చౌడేపల్లె) మణికంఠ, సుమలత, మురళి, కన్యాకుమారి, దంపతులు (మదనపల్లె) హనుమప్ప, విద్యావతి(ముళబాగిల్) ఒంటిమిట్ట నాయునివారు, శివకుమార్, దుర్గదంపతులు (బెంగళూరు) ఉభయదారులుగా వ్యవహరించారు.



అమ్మవారి ఉత్సవమూర్తి ఎదుట హోమ పూజలు చేస్తున్న వేద పండితులు

నేడు పార్వతీదేవి అలంకారం

దసరా మహోత్సవాల్లో భాగంగా రెండవరోజైన బుధవారం అమ్మవారు పార్వతీదేవి అలంకారంలో దర్శనమివ్వనున్నట్లు ఆలయ ఈఓ ఏకాంబరం తెలిపారు. ఉభయదారులుగా పాల్గొనే భక్తులు రూ.5116 చెల్లించి రశీదు పొందాలని కోరారు.



బోయకొండలో బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో కొలువుదీరిన గంగమ్మ